క్లుప్తంగా

చూచుకొండలో ఉపాధిహామీ గ్రామసభ


మాట్లాడుతున్న ఉపాధిహామీ పథకం ఏపీవో ఎరకయ్య

మునగపాక : ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏపీవో ఎరకయ్య కోరారు. చూచుకొండలో శనివారం ఉపాధి హామీ పథకం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారులు, డ్రైనేజీలు, కాలువలు, చెరువులు వంటి పనులు చేపట్టేందుకు ఈ పథకం ఎంతగానో దోహదపడుతుందన్నారు. 2023–24 సంవత్సరానికి గాను చూచుకొండలో రూ.65 లక్షలు ఖర్చు చేశామన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో కూడా పలు పనులు చేపట్టేందుకు ఆమోదం అందించాలన్నారు. సర్పంచ్ దొడ్డి సూరప్పారావు, ఎంపీటీసీ కాండ్రేగుల కిరణ్‌కుమార్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

8న విద్యా సంస్థల బంద్‌కు పిలుపు


బంద్‌కు పిలుపునిస్తూ గోడ పత్రికలను విడుదల చేస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

పాయకరావుపేట : ఈ నెల 8వ తేదీన విద్యా సంస్థలు బంద్ ప్రకటించడం జరిగిందని, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.బాబ్జి తెలిపారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిలుపుదల చేయాలని, కడప స్టీల్‌ప్లాంట్ నిర్మాణం త్వరగా చేపట్టాలని డిమాండ్ చేస్తూ విద్యా సంస్థల బంద్‌కు పిలుపునిచ్చినట్టు తెలిపారు. అనంతరం గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు ఎ.జగదీష్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్ల మంజూరు


తిమ్మరాజుపేటలో పింఛన్ అందజేస్తున్న గృహ సారథి నాగేశ్వరరావు

మునగపాక : అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్‌లు అందజేస్తున్నామని తిమ్మరాజుపేట గృహ సారథి భీమరశెట్టి నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని తిమ్మరాజుపేటలో శనివారం ఆయన వలంటీర్లతో కలిసి పింఛన్‌లు అందజేశారు. కార్యక్రమంలో గృహసారథులు సూరిశెట్టి మాధవి, మళ్ల గోపి, కొయిలాడ చిన్న, శరగడం పుష్ప తదితరులు పాల్గొన్నారు.

గుమ్మడి అమ్మలు ఆలయం ప్రారంభం


అమ్మవారిని దర్శనం చేసుకుంటున్న మాజీ ఎంపీ పప్పల తదితరులు

రాంబిల్లి: కొత్తూరులో శనివారం గుమ్మడి అమ్మలు పేరంటాలు అమ్మవారి ఆలయం ప్రారంభం, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. సుందరపు విజయ్‌కుమార్ కుటుంబసభ్యులు ఈ ఆలయాన్ని తమ సొంత నిధులతో నిర్మించారు. ఈ సందర్భంగా పురోహితులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, సుందరపు విజయ్‌కుమార్ కుటుంబసభ్యులు అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు.

కుల గణన నిర్ణయంపై హర్షం

అనకాపల్లిటౌన్: ప్రభుత్వం కుల గణన, కులాల వారీ లెక్కలు తేల్చడానికి ఆమోదం తెలిపినందుకు హర్షం వ్యక్తం చేస్తున్నట్లు ఆల్ ఇండియా బీసీ ఫెడరేషన్ ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షుడు విల్లూరి పైడారావు తెలిపారు. గవరపాలెంలోని తమ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా కులాల లెక్కలను ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే తయారు చేయించి, రాబోయే ఎన్నికల్లో బీసీ కులాల వారికి అత్యధిక ప్రాధాన్యత కల్పించాలన్నారు. డిసెంబర్ నాటికి లెక్కలు పూర్తిచేసి క్యాబినెట్లో తీర్మానం చేయాలని కోరారు.

పక్కాగా ఓటర్ల జాబితా రూపకల్పన

- ఓటరు నమోదుకు కొనసాగుతున్న ప్రత్యేక శిబిరాలు
- నియోజకవర్గంలో 2,02,732 మంది ఓటర్లు
- జనవరి 5న తుది జాబితా


యలమంచిలి తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న ఈఆర్వో మనోరమ

యలమంచిలి(అనకాపల్లి రూరల్) : ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో కీలకం. ఓటు హక్కును ఓటర్లు వినియోగించుకునేందుకు ఎన్నికల కమిషన్ ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఓటర్ల జాబితాను పారదర్శకంగా సిద్ధం చేస్తోంది.దీనిలో భాగంగా ఇప్పటికే ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రకటించిన ఎన్నికల కమిషన్ నవంబరు, డిసెంబరు నెలల్లో ఓటర్ల జాబితాకు తుది మెరుగులు దిద్ది సార్వత్రిక ఎన్నికలకు తుది జాబితాను సిద్ధం చేసేందుకు సన్నాహాలు చేస్తోంది.

పక్కాగా జాబితా రూపకల్పన

సాధారణ ఎన్నికలు సమీపిస్తున్నాయి. మరో ఆరు నెలల్లో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు నోటిఫికేషన్ రానుంది. దీంతో ఇప్పటినుంచే యంత్రాంగం సిద్ధమౌతోంది. ఓటర్ల జాబితాలో ఎలాంటి తప్పులు, అభ్యంతరాలకు తావివ్వకుండా పకడ్బందీగా రూపొందిస్తున్నారు. గత నెల 27న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రకటించి నియోజకవర్గంలో ఓటర్లు ఎంతమంది ఉన్నారో అనే అంశంపై లెక్క తేల్చింది. ఈ జాబితా ప్రకారం యలమంచిలి నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో 246 పోలింగ్ కేంద్రాల్లో మొత్తం ఓటర్లలో మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. యలమంచిలి నియోజకవర్గంలో పురుష ఓటర్లు 98,975, మహిళా ఓటర్లు 1,03,742, ఇతరులు 15 మంది ఉన్నారు. మొత్తం 2,02,732 మంది ఓటర్లు ఉన్నట్టు ముసాయిదా జాబితా ప్రకటన ద్వారా తేల్చారు. ఈ నేపథ్యంలో ఈ ప్రచురణపై అభ్యంతరాలుంటే తెలియజేయాలని ఎన్నికల కమిషన్ ప్రజలను కోరింది. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ముసాయిదా జాబితా ప్రకటన తర్వాత నియోజకవర్గంలోని మండలాల వారీగా రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు సైతం యలమంచిలి ఈఆర్వో కె మనోరమ నిర్వహించారు. వారితో ఓటరు జాబితాకు సంబంధించి తాజా షెడ్యూల్ గురించి వివరించారు. ఎటువంటి తప్పులు చోటు చేసుకోకుండా తుది జాబితా విడుదలకు పార్టీల నాయకులు, ప్రతినిధులు సహకరించాలని ఆయన కోరారు. సార్వత్రిక ఎన్నికలకు పటిష్టంగా పారదర్శకమైన ఓటరు జాబితా సిద్ధం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, యలమంచిలి ఎస్‌ఏవోబీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె మనోరమ తెలిపారు.

నమోదుకు ప్రత్యేక శిబిరాలు

మరోమారు నూతన ఓటర్ల నమోదుకు సైతం అవకాశం కల్పించేందుకు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించింది. ఈ మేరకు నవంబరు 4, 5 తేదీల్లో డిసెంబరు 2, 3 తేదీల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. అలాగే ప్రకటించిన ఓటరు జాబితాలో అభ్యంతరాలు, మార్పులు, చేర్పులకు కూడా అవకాశం కల్పించింది. ఈ ప్రత్యేక శిబిరాల సమయంలో ప్రతి పోలింగ్ కేంద్రంలో బీఎల్వోలు తప్పనిసరిగా ఉండాలని అధికారులు ఆదేశించారు. దీనికి సంబంధించి నియోజకవర్గంలో బీఎల్వోలందరికీ ఇప్పటికే స్పష్టమైన సూచనలిచ్చారు. ప్రత్యేక నమోదు సమయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో సూచించారు. తహశీల్దార్లు, ఎంపీడీవోలు ఈ ప్రక్రియను పర్యవేక్షించేలా కార్యాచరణ రూపొందించారు. తుది జాబితాను వచ్చే జనవరి 5న ప్రకటించనున్నారు.ఓ వైపు ప్రభుత్వం, మరోవైపు ఎన్నికల సంఘం రానున్న సార్వత్రిక ఎన్నికలపై దృష్టి కేంద్రీకరించి ప్రక్రియ వడివడిగా ముందుకు సాగుతోంది. పారదర్శకమైన ఓటర్ల జాబితా రూపకల్పనకు చర్యలు తీసుకుంటున్నారు అధికారులు.

అర్హులందరినీ ఓటర్లుగా చేర్చాలి

యలమంచిలి: అర్హత కలిగిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా చేర్చాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి కె.మనోరమ బీఎల్వోలు, ఇతర ఎన్నికల సిబ్బందిని ఆదేశించారు. ఓటరు జాబితా సవరణ 2023లో భాగంగా శనివారం యలమంచిలి పట్టణం, మండలంలోని పలు పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాలను పరిశీలించారు. యలమంచిలి పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, తులసీనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఎర్రవరం ఎంపీపీ స్కూల్, రేగుపాలెం, లైనుకొత్తూరు పాఠశాలల్లో పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలపై ఆరా తీశారు. విద్యుత్, తాగునీరు, టాయిలెట్లు, ఓటు వేసేందుకు వచ్చే దివ్యాంగులకు ర్యాంపుల పరిస్థితిని చూసి తెలుసుకున్నారు. ఎర్రవరం ఎంపీపీ పాఠశాలలో ర్యాంపు చాలా ఎత్తుగా వాలు ఎక్కువగా ఉండడాన్ని చూసి ర్యాంపు మరమ్మతు చేయించడానికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఓటరు జాబితాలు పరిశీలించారు. మరణించిన వారి పేర్లు జాబితా నుంచి తొలగించేందుకు సంబంధిత కుటుంబ సభ్యుడి నుంచి ఫారం–7 స్వీకరించాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఈఆర్వో, ఏఈఆర్వో, బీఎల్‌వో ఫోన్ నంబర్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈ నెల 5వ తేదీ ఆదివారం కూడా ప్రత్యేక నమోదు కార్యక్రమంలో భాగంగా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ పోలింగ్ కేంద్రాల వద్ద సిబ్బంది అందుబాటులో ఉంటారని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగపర్చుకోవాలని రిటర్నింగ్ అధికారి మనోరమ కోరారు. ఏటికొప్పాకలో తహసీల్దార్ రాణి అమ్మాజీ పోలింగ్ కేంద్రాలను పరిశీలించి బీఎల్వోలకు పలు సూచనలు ఇచ్చారు. పోలింగ్ కేంద్రాల తనిఖీల్లో స్పెషల్ డిప్యూటీ కార్యాలయం అధికారి నరసింహమూర్తి, మున్సిపల్ పట్టణ ప్రణాళికా విభాగం ఉద్యోగి అన్నాజీ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, ఎన్నికల విభాగం సిబ్బంది, బీఎల్వోలు పాల్గొన్నారు.


పోలింగ్ కేంద్రంలో వసతులపై ఆరా తీస్తున్న రిటర్నింగ్ అధికారి మనోరమ

అర్హులందరికీ ఓటు హక్కు



అర్హులందరికీ ఓటు హక్కు కల్పించేలా శ్రద్ధ తీసుకుంటున్నాం. ఓటర్ల ముసాయిదా జాబితా ప్రకటన తర్వాత ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం నవీకరణ ప్రక్రియను పారదర్శకంగా చేపడుతున్నాం. ఇప్పటికే బీఎల్వోలందరికీ పారదర్శకమైన ఓటర్ల జాబితా తయారీకి స్పష్టమైన ఆదేశాలిచ్చాం. ప్రత్యేక శిబిరాలను యువ ఓటర్లు వినియోగించుకోవాలి. ఓటర్లంతా తమ ఓటు జాబితాలో ఉందో లేదో చూసుకోవాలి. ఒకవేళ తప్పులు ఉంటే సరిచేయించుకోవాలి. ఇప్పటికే 18 ఏళ్లు నిండిన వారితో పాటు 2024 జనవరి 1వ తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండేవారు ఓటరుగా నమోదు చేసుకోవచ్చు. 2024 ఏప్రిల్ 1, జూలై 1, అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు నిండేవారు కూడా ముందస్తు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రత్యేక శిబిరాల సమయంలో ప్రతి పోలింగ్ బూత్ వద్ద బీఎల్వోలు అందుబాటులో ఉంటారు. –కె. మనోరమ, రిటర్నింగ్ అధికారి, యలమంచిలి

మాదిగ విశ్వరూప మహాసభ పోస్టర్ ఆవిష్కరణ


ఎమ్మార్పీఎస్ మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంగరాజు

అనకాపల్లిటౌన్: ఎస్సీ వర్గీకరణకు ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కట్టమూరి మంగరాజు కోరారు. ఈ నెల 11న హలో మాదిగ.. ఛలో హైదరాబాద్(మాదిగ విశ్వరూప మహాసభ) గోడ పత్రికను విజయరామరాజుపేటలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ భారీ బహిరంగ సభకు ప్రధాని నరేంద్రమోదీ విచ్చేయనున్నట్లు తెలిపారు. ఎస్సీ వర్గీకరణ చేయడంతో మాదిగలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. హైదరాబాద్‌లో జరిగే బహిరంగ సభకు జిల్లాలోని మాదిగలంతా తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కొల్లి చిన్నఅప్పారావు, కొండలరావు, మారేడిపూడి ఈశ్వరరావు, ముప్పిడి చిన్న, ములగాడ నూకన్న, ప్రసాద్, బద్రి, లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం రక్షణ భేరి విజయవంతం చేయాలి


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

మునగపాక(అచ్యుతాపురం): కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతి ఒక్కరూ నిరసించాలని సీపీఎం నేత ఆర్.రాము పిలుపునిచ్చారు. సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రక్షణ భేరి బస్సు యాత్ర ఆదివారం అచ్యుతాపురానికి చేరుకుంటున్న నేపథ్యంలో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ శనివారం కరపత్రాలు అందజేశారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు సోమినాయుడు, రంగారావు, ప్రశాంత్ పాల్గొన్నారు.

మునగపాక ఉత్సవ కమిటీ చైర్మన్‌గా కృష్ణ


వేగి కృష్ణ

మునగపాక : మేజర్ పంచాయతీ మునగపాక ఉత్సవ కమిటీ చైర్మన్‌గా 5వ వార్డు సభ్యులు వేగి కృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రెండేళ్లకోసారి ఉత్సవ కమిటీ ఎన్నిక జరుగుతుంది. దీనిలో భాగంగా శనివారం పంచాయతీ కార్యాలయం ఆవరణలో గ్రామ పెద్దల సమక్షంలో కృష్ణను ఉత్సవ కమిటీ చైర్మన్‌గా ఎన్నుకున్నారు. గ్రామంలో జరిగే గ్రామ దేవత పండుగలతో పాటు ఉత్సవాలు కూడా ఘనంగా జరిపేలా ఉత్సవ కమిటీ చైర్మన్ సేవలందించాల్సి ఉంది. కృష్ణను ఉత్సవ కమిటీ చైర్మన్‌గా పెద్దలంతా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కృష్ణ వైఎస్సార్‌సీపీలో చురుకైన పాత్ర పోషించడంతో పాటు గ్రామ సమస్యలపై అవగాహన కలిగిన నాయకునిగా గుర్తింపు పొందారు. కృష్ణ ఉత్సవ కమిటీ చైర్మన్‌గా నియమించడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా తనకు ఉత్సవ కమిటీ చైర్మన్‌గా అవకాశం కల్పించడంలో కృషి చేసిన వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, సర్పంచ్ దిమ్మల అప్పారావుకు కృతజ్ఞతలు తెలిపారు.

సీఎం చిత్రపటానికి జర్నలిస్టుల క్షీరాభిషేకం


నక్కపల్లిలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న పాత్రికేయులు

నక్కపల్లి: అర్హత గల పాత్రికేయులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని నిర్ణయించినందుకు నక్కపల్లి జర్నలిస్టులు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి శనివారం క్షీరాభిషేకం చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ నిలబెట్టుకొని పాత్రికేయులకు మూడు సెంట్ల చొప్పున ఇంటి స్థలం కేటాయించేందుకు నిర్ణయం తీసుకోవడంతోపాటు మంత్రిమండలిలో ఆమోదించడం గొప్ప ఘవిషయమన్నారు. ఏపీయూడబ్ల్యూజే జిల్లా కార్యదర్శి కోరాడ చంద్రరావు, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు ఆచంట రామకృష్ణల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కాపు కార్పొరేషన్, ఏపీఎఫ్‌యూబిడీసీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, వైస్ ఎంపీపీ వీసం నానాజీ, సర్పంచ్ సురేష్‌వర్మ, తళ్ల భార్గవ్, ఎంపీటీసీ గోవిందు పాల్గొన్నారు.

వై.లోవ గ్రామస్తుల సంతకాల సేకరణ


సంతకాల సేకరణ చేస్తున్న వై.లోవ, పెదకలవలాపల్లి గ్రామస్తులు

రాంబిల్లి: నేవల్‌బేస్ ప్రహరీ నిర్మాణం, శారద నదిని కప్పేయడంతో ఉపాధి కోల్పోతున్న తమకు పరిహారం అందించి ఆదుకోవాలని సీఎం వై.ఎస్. జగన్‌మోహనరెడ్డికి తెలియజేసేందుకు శనివారం పెదకలవలాపల్లి, వై.లోవ గ్రామాల ప్రజలు సంతకాల సేకరణ చేపట్టారు. ప్రహరీ పనులు ఇప్పటికే అడ్డుకున్నామని జేఏసీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నాయకుడు రావి దేముళ్లు తెలిపారు. తమ సమస్యలను సీఎం దృష్టికి తీసుకువెళ్లేందుకు ఈ సంతకాల సేకరణ చేపడుతున్నామన్నారు.

ప్రజలకు నిస్వార్థమైన సేవలందించాలి


ఉప సర్పంచ్‌గా నియమితుడైన అప్పలనాయుడును సత్కరిస్తున్న బొడ్డేడ ప్రసాద్

మునగపాక : పదవులు అలంకార ప్రాయం కాకుండా బాధ్యతగా పనిచేసి ప్రజలకు సేవలందించేలా ఉండాలని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ పిలుపునిచ్చారు. ముందస్తు ఒప్పందంలో భాగంగా మునగపాక పంచాయతీ ఉప సర్పంచ్‌గా బొడ్డేడ అప్పలనాయుడును నియమించడంలో భాగంగా శనివారం పంచాయతీ కార్యాలయం వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ఇంతవరకు ఉప సర్పంచ్‌గా పనిచేసిన సత్యనారాయణ సేవలు గ్రామానికి అవసరమన్నారు. నూతనంగా ఉప సర్పంచ్‌గా ఎన్నికైన అప్పలనాయుడు పాలకవర్గ సభ్యులతో కలిసి గ్రామాభివృద్ధికి పాటుపడాలన్నారు. అనంతరం అప్పలనాయుడును ఘనంగా సత్కరించారు. వార్డు సభ్యుడు వేగి కృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ దిమ్మల అప్పారావు, సచివాలయాల మండల కన్వీనర్ పొలిమేర గణేష్, ఎంపీటీసీ సూరిశెట్టి రాము పాల్గొన్నారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల నిలుపు మహోత్సవాలు


కుంచావారి గౌరీపరమేశ్వరులను ఊరేగిస్తున్న కమిటీ సభ్యులు

అనకాపల్లిటౌన్: స్థానిక వేల్పులవీధి, కుంచావారి గౌరీపరమేశ్వరుల అమ్మవారి నిలుపు మహోత్సవాన్ని శనివారం రాత్రి ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ముందుగా వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల అమ్మవారి పీఠాన్ని వేల్పుల గణేష్ స్వగృహం నుంచి బయటకు తెచ్చారు. పూడిమడక రహదారిలో వరిపాలం నుంచి వరిదుబ్బు తీసుకుని వచ్చి కుంచావారి గౌరీపరమేశ్వరుల అమ్మవారి ఆలయంలో నిలుపుదల చేశారు. వేల్పుల వీధి అమ్మవారి ఊరేగింపు రథాన్ని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీ రామరాజు, పార్టీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్‌లు ప్రారంభించారు. అనంతరం అమ్మవార్లను పట్టణంలో పురవీధుల గుండా ఊరేగించారు. ఆదివారం తెల్లవారుజామున అమ్మవార్లను ఆలయాల్లో నిలుపుదల చేయనున్నారు. కార్యక్రమంలో వేల్పులవీధి, కుంచావారివీధి ఆలయాల కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో భిక్ష కార్యక్రమం


మునగపాక అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో భిక్ష సదుపాయం

మునగపాక : మునగపాక అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన భిక్ష కార్యక్రమం నిర్విరామంగా కొనసాగుతుంది. గత నెల అక్టోబర్ 25న ప్రారంభించిన భిక్ష శనివారం నాటికి 11 రోజులకు చేరుకుంది. అయ్యప్ప మాలలు ధరించిన భక్తులతో పాటు ఇతర భక్తులు కూడా భిక్ష సదుపాయాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. పూడిమడక ప్రధాన రహదారికి సమీపంలో అయ్యప్ప స్వామి ఆలయం ఉండడంతో ఈ మార్గం గుండా రాకపోకలు సాగించే అయ్యప్ప భక్తులు ఈ భిక్షకు హాజరవుతున్నారు. 50 రోజుల పాటు భిక్ష సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకున్నామని పాలకవర్గ సభ్యులు తెలిపారు.

ఇంజినీరింగ్ విద్యార్థికి గ్లో వరల్డ్ రికార్డు


సంజయ్ దీపక్‌కు గ్లో వరల్డ్ రికార్డు సర్టిఫికెట్ అందిస్తున్న కళాశాల సెక్రటరీ శ్రీలక్ష్మి

పాయకరావుపేట : పట్టణానికి చెందిన ఇంజినీరింగ్ విద్యార్థికి గ్లోవరల్డ్ రికార్డు దక్కింది. బాబా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కాలేజీ (విశాఖపట్నం)లో 3వ సంవత్సరం విద్యార్థి కె.సంజయ్ దీపక్‌కు పెన్సిల్ ముల్లుపై మైక్రో ఆర్ట్ వేసినందుకు గ్లో వరల్డ్ రికార్డు సాధించాడు. ఆ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ కె.శ్రీలక్ష్మి చేతుల మీదుగా సంజయ్ దీపక్‌కు సర్టిఫికెట్ అందించారు.

ఉపాధిహామీ పథకం గ్రామసభ


గ్రామసభలో పనులు వివరిస్తున్న ఫీల్డు అసిస్టెంట్

రాంబిల్లి : దిమిలిలో ఉపాధిహామీ పథకానికి సంబంధించిన గ్రామసభను నిర్వహించారు. వచ్చే ఆర్థిక సంవత్సరం చేపట్టే పనులపై చర్చించారు. గ్రామసభలో పనులు గుర్తించి వాటిని ఆమోదించారు. ఫీల్డు అసిస్టెంట్ కె.అన్నపూర్ణ వచ్చే ఆర్థిక సంవత్సరంలో చేపట్టే పనులను వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిలుకు, ఉప సర్పంచ్ మురళీకృష్ణ, పంచాయతీ కార్యదర్శి రాజుబాబు, డిజిటల్ అసిస్టెంట్ శ్రీను పాల్గొన్నారు.

కోటి బిల్వార్చనకు తరలిన స్వాములు


స్వామి కలశంను ఊరేగింపుగా తీసుకెళ్తున్న స్వాములు

పాయకరావుపేట : తునిలో శనివారం జరిగిన అయ్యప్ప స్వామి పడి పూజ కోటి బిల్వార్చనకు పాయకరావుపేట నుంచి అధిక సంఖ్యలో స్వాములు బయలుదేరి వెళ్లారు. పట్టణంలో గల చంటి స్వామి ఇంటి నుంచి పూజ కలశంతో చంటి స్వామితో పాటు పలువురు స్వాములు ఊరేగింపుగా బయలుదేరి వెళ్లారు. ఈ ఊరేగింపులో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, కాంగ్రెసు పార్టీ రాష్ట్ర కార్యదర్శి జగతా శ్రీనివాస్, బీజేపీ నాయకులు తోట నగేష్, పంచాయతీ ఉపసర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, పాండురంగ దేవస్థానం మాజీ అధ్యక్షుడు యాళ్ళ వరహాలు వెళ్లారు.

ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరానికి విశేష స్పందన


క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్న అగనంపూడి క్యాన్సర్ ఆస్పత్రి వైద్యులు

దేవరాపల్లి: ఎం. అలమండలో శనివారం నిర్వహించిన ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. అగనంపూడిలోని హోమ్ బాబా క్యాన్సర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని సర్పంచ్, గవర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ దాడి జగన్ ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో ప్రివెంటివ్ అంకాలజీ డిపార్టుమెంట్ వైద్యులు హర్షిత, తరుణ్ 61 మందిని పరీక్షించారు. ఓరల్, బ్రెస్ట్, సెర్వైకల్, పెనైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ చేశారు. అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. క్యాన్సర్ మహమ్మారి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపైన అవగాహన కల్పించారు. ఈ శిబిరానికి వేచలం పీహెచ్‌సీ వైద్యాధికారి బి. హారిక, స్థానిక వైద్య సిబ్బంది సహాయ సహకారాలు అందించారు.

కళాశాల అధ్యాపకునికి డాక్టరేట్


డాక్టరేట్ తీసుకుంటున్న వెంకటరమణ

అనకాపల్లిటౌన్: మండలంలోని సుందరయ్య గ్రామానికి చెందిన ఆర్థశాస్త్రం(ఎకనామిక్స్) అధ్యాపకుడు బోయిన వెంకటరమణకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం శుక్రవారం డాక్టరేట్ ప్రదానం చేసింది. గిరిజనుల మైనర్ అటవీ ఉత్పత్తుల సేకరణ, వాటి మార్కెటింగ్ వ్యూహాలపై ఆయన చేసిన పరిశోధనకు విశ్వవిద్యాలయం డీన్, ఆర్థశాస్త్ర విభాగాధిపతి ఆచార్య కె.మధుబాబు చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నారు. ఈయన యలమంచిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అర్థశాస్త్ర అధ్యాపకునిగా విధులు నిర్వహిస్తున్నారు. ఈయన సుందరయ్యపేట గ్రామానికి చెందిన సీనియర్ కమ్యూనిస్టు నేత, దివంగత బోయిన మల్లయ్య పెద్ద కుమారుడు. కశింకోట మండలంలో ఎస్‌జీటీగా, పూడిమడక ప్రభుత్వ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా, జూనియర్ లెక్చరర్‌గా రోలుగుంట, నక్కపల్లి, చోడవరం, యలమంచిలి కళాశాలల్లో పనిచేశారు. ఆయనకు డాక్టరేట్ రావడం పట్ల యలమంచిలి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.చంద్రశేఖర్, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

చెరువు ఆక్రమణలో ఆరుగురిపై కేసు

మునగపాక: గంగాదేవిపేటలో ప్రభుత్వ స్థలం ఆక్రమించి పాకలు నిర్మించుకున్న ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహమ్మద్ ఆలీ షరీఫ్ శనివారం తెలిపారు. ఆక్రమణలపై అందిన ఫిర్యాదు మేరకు కలెక్టర్ ఆదేశాలతో ఇక్కడ చెరువు ఆక్రమణ స్థలంలో రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారని, అయినా ఆక్రమణదారులు స్పందించకపోవడంతో కేసు నమోదు చేశామన్నారు. ఎవరైనా ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.